


నాయని శేషాచలరావు, బి.ఏ.

పరికరములు:—గొలుసుతో వున్న ఒక తెల్లని బొచ్చు కుక్క.

స్థలము:—మధ్యను చెట్టు గల నొక పెద్ద బయలు.

పార్టీలు:—

| ఏ | బి |
|---|---|
| ఆడలవ్వార్ పార్టీ. | మగలవ్వార్ పార్టీ. |
| 1. ఆడలవ్వారు (లలిత). | 1. మగలవ్వారు (మాస్టరు బూత్), |
| 2. ఆడలవ్వారు స్నేహితురాలు (చంటి). | 2. మగలవ్వారు స్నేహితుడు ('సూరి'). |

వరా:—ఆడలవ్వారు, ఆడలవ్వారు స్నేహితురాలు చెట్టున కొక ఫర్లాంగులో కుక్కను గొలుసుతో పట్టుకుని నిలువవలెను. మగలవ్వారు, మగలవ్వారు స్నేహితుడు ఆ చెట్టునకు ఫర్లాంగులో మరియొక వైపున నిలిచియుండవలెను.

డైరెక్టరుగారి ఉత్తరువు:—విజిల్ వేసినతోడనే ఆడలవ్వారుపార్టీ కుక్కను గొలుసుతో విడువవలెను. ఆ కుక్క మగలవ్వా రున్న పార్టీవద్దకు రావలెను. మగలవ్వారు దానిని పట్టుకొనవలెను. ఈ రెండు పార్టీలు చెట్టువద్దకు రావలెను. ఆడలవ్వారు కుక్క 'నాది అని' మగలవ్వారు చేతిలోని కుక్క గొలుసును లాగవలెను! ఇద్దరు గొలుసును గుంజవలెను.

ఇదే సమయమున ఆడలవ్వారు స్నేహితురాలు 'చంటి' మగలవ్వారు స్నేహితుడు 'సూరి' సైట్లు కొట్టుకొనవలెను.

చివరకు మగలవ్వారు తన మూతిని ఆడలవ్వారు మూతివద్దకు తీసుకునివచ్చి చుంబన మభినయించి కుక్క గొలుసును ఆడలవ్వారు చేతి కివ్వవలెను. ఆడలవ్వారు మగలవ్వారుపై సైట్లుకొట్టుచూ

వెనుకకు నడచి కుక్కను తీసుకునిపోవలెను. మగలవ్వరు ముందునకు పది అడుగులు పోయి తరువాత పది అడుగులు వెనుకకు వచ్చి, చెట్టెక్కి. ఆడలవ్వరు దృష్టిపథమునుండి మాయమగువరకును జూడవలెను. ఆ తరువాత మగలవ్వరు "బాసిపోతివే సఖీ!" అనే పదమును గొంతుక చించుకుని పాడవలెను.

స్థలము:—బయలు. ప్రవేశము: చిన్న డైరెక్టరు, పెద్ద డైరెక్టరు మాట్లాడుతూ.

చిన్న డైరె:—బయలు మధ్యవున్నది సీమ చింతచెట్టుగాని జీడిమామిడి చెట్టు కాదండి.

పెద్ద డైరె:—పోనియ్యి ఏ చెట్టైతే నేమి?

చిన్న డైరె:—సీమ చింతచెట్టుకు ముండ్లుంటవండీ!

పెద్ద డైరె:—Love కూడ ముండ్లవల గ్రుచ్చుకునేదే కదూ.

చిన్న డైరె:—మగలవ్వ రప్పుడూ సీమ చింత చెట్టెక్క లేదటండి.

పెద్ద డైరె:—(ఆలోచించి) పోని ఆడలవ్వరు ఎక్కగలదా?

చిన్న డైరె:—స్త్రీలు చెట్లెక్కరండి.

పెద్ద డైరె:—Love సమయమొస్తే చెట్లెక్కోకే గట్లెక్కోలే. అయినా అడిగి చూశారా?

చిన్న డైరె:—అడిగినా లాభము లేదండి.

పెద్ద డైరె:—అయితే యిప్పు డెట్లాగా లవ్ రీల (Love Reel) జరగడం.

చిన్న డైరె:—అదేమో మీరే ఆలోచించాల.

పెద్ద డైరె:—(ఆలోచించి) సూరి ఎక్కగలడా ఆ చెట్టు.

చిన్న డైరె:—ఓ, ఎక్కకేమి! వాండు మొండి ముండ వాడు.

పెద్ద డైరె:—అయితే 'సూరి' చెట్టు ఎక్కి అభినయించవలెను. క్రిందనుండి మగలవ్వరు పాడవలెను.

చిన్న డైరె:—పాటొకడూ అభినయమొకడునా!

పెద్ద డైరె:—లేకపోతే సినిమా ఎలాగ కుదురుతుంది?

చిన్న డైరె:—పోనీ సూరినే మగలవ్వరు పార్టు వేయమందాము.

పెద్ద డైరె:—వాడు ఆడలవ్వరు స్నేహితురాలికి సెట్లు కొట్టొద్దూ!

చిన్న డైరె:—ఆ సెట్లు మగలవ్వరే కొడుతాడు.

పెద్ద డైరె:—ఛా. మగలవ్వరు ముద్దులు పెట్టుటకు ఆడలవ్వరు సెట్లు కొట్టుటకు. ఎవరి పార్టు వారిదే.

చిన్న డైరె:—అయితే. ఇప్పుడేమి చెయ్యమంటారు?

పెద్ద డైరె:—సూరిని చెట్టెక్కి అభినయించమను. మగలవ్వరును క్రిందనుండి పాడమను.

చిన్న డైరె:—చెట్టెక్కే తంతు తీసి పారయ్య కూడదూ?

పెద్ద డైరె:—చెట్టెక్కి పాడకపోతే రొమాన్సే లేదు.

ప్ర॥ సేవకుడు

సేవ:—అంతా తయారుగా వున్నారండి.

డైరె:—ఏ కుక్కను తెచ్చారు?


చిన్న డైరె:—"గాంధి"ని తెచ్చారు.

సేవ:—అది గాంధిపేరు చెడగొట్టుతూ వుందండి. ఆయన ఎంత శాంతుడో యిది అంత వడిసుడుకు. ఆయన పేరు దీనికి పెట్టడ మేమిటి?

చిన్న డైరె:—ఆయన పేరు అగ్గిపెట్లలకు బీడికట్టలకు పెట్టగా లేనిది కుక్కను పెడితే తప్పు వచ్చినదా!

సేవ:—అది కాదు. దీనిని వదలితే యిక ఆట మనకు చిక్కదు.

పెద్ద డైరె:—ఫరవాలేదు......అసిస్టెంటు డైరెక్టరుగారు! మీరు మగలవ్వరు పార్టీవైపు వెళ్ళి వాండ్రకు సలహా లివ్వండి. నేను ఆడలవ్వరు పార్టీవైపు వెళ్ళుచున్నాను.



(బయలునకు ఒక వైపున ఆడలవ్వారు 'లలిత.' ఆవిడ స్నేహితురాలు 'చంటి' నిలబడి వుందురు.)

లలిత:—చంటి, జాకెట్ ఎందుకూ బాడీ చాలదూ!

చంటి:—బాడీ చాల కేమి చేస్తుంది! ఇప్పుడు పెద్ద పెద్ద వారంతా టీ పార్టీలకు రిబ్బను బాడీలతోనే రావడం.

లలిత:—అయితే చూడు బాగా వున్నానా?

చంటి:—బాగా వున్నారు. అలా అగుపడుతుంటేనే సినిమా కెమేరాకు అందము. (పైట సర్దును).

లలిత:—నీ మొహం. (సవరించుకుని) ఇప్పుడు మన మేమి చెయ్యవలెను?

చంటి:—(కుక్క-గొలుసు లలిత కందించుచు) దీనిని పట్టుకుని మీరు నిలుచోవలెను.

లలిత:—ఇదేమిటి యీ కుక్కను తెచ్చారు. (కుక్కను ఆపలేక) కుక్క నన్ను లాగుకొని పోతూవుంది. చంటి నీవుకూడ పట్టుకోవే గొలుసును.

చంటి:—కుక్క ముందుకు లాగినట్లు ప్రేమ ముందుకు లాగుతూ వున్నదన్న మాట.

లలిత:—కుక్కవంటి ప్రేమ కాదుగద.

చంటి:—కుక్కవంటి ప్రేమ కాకేమి? సినిమాలలో ప్రేమించేది కుక్క వంటిది. అందుకనే మీ యిద్దరి మధ్య కుక్కను పెట్టడం.

లలిత:—ఇదుగో మాట్లాడకు. డైరెక్టరుగారు వస్తున్నారు.

(బయలునకు మరియొక వైపున మగలవ్వారు మాస్టరు బూత్, అతని స్నేహితుడు సూరి, అసిస్టెంటు డైరెక్టరు వారిని సమీపించును).

మగలవ్వారు:—అసిస్టెంటు డైరెక్టరుగారూ, చూపుతూపై హృదయమున నాటునని అనుభవ సిద్ధముగ చూపవలెనని వున్నది.

అ. డై:—అందున కేమి చేయుదురు?

మగ:—చూచారా, యీ చిన్న వెదురు బాణమును. నేను అవిడను చూచీ చూచినంతనే యీ బాణమును తీసి ఆవిడ వక్షస్థలాన్ని నాటుతాను.

అ. డై:—ఆవిడకు గ్రుచ్చుకోదూ!

మగ:—గ్రుచ్చుకోదు. అందుకనే ఆవిడ బాడీలో పైనపు మద్ద పెట్టించాను.

అ. డై:—సరే. ఆ సులువంతా మీరు చూచుకో వలసినదే.

సూరి:—అయ్యా, నన్నేమి చెయ్యమంటారు?

అ. డై:—నీ పనేమి లేదు. సెట్లు కొట్టడమే.

సూరి:—అటువంటి బాణం నేనూ గ్రుచ్చొద్దూ?

అ. డై:—వద్దు. నీ 'లా' అంత యింపార్టెంటు కాదు.

సూరి:—చిత్రం. మా 'లా' బడి పంతులవలె విలువ లేనిదన్న మాట.

అ. డై:—అవును, అదుగో డైరెక్టరుగారు విజిల్ వేస్తున్నారు. సిద్ధముగా వుండండి.

డైరెక్టరుగారి విజిల్

ఒకడు:—(గట్టిగా) "కుక్కను వదలండి. ఆడ పార్టీవారు కుక్కను తరుముకుని రండి. మగ పార్టీవారు కుక్కను పట్టుకు రండి. రెండు పార్టీలు చెట్టుక్రిందకు రావలెను."

[కుక్కను వదలగా కుక్క అడ్డము తిరిగి పరుగెత్తును.]

డైర:—ఏయ్. ఏయ్. 'గాంధి.' 'గాంధి.' దూ. దూ. దూ. ఇట్లాగా. ఇట్లాగా:.........* ఛా. కుక్కకు గాంధి పేరేమిటి?

సేవ:—దీని శిఖ గొయ్యా' కుక్క అడ్డంపడ పరుగెత్తిందండి.

డైర:—(సేవకులతో) ఇద్దరు వెళ్ళి కుక్కను పట్టుకు రండి. 'లా' గుడ్డిదారుల పరుగెత్తినట్లు యిదీ గుడ్డిదారుల పరుగెత్తింది.

[ఆడ లా పార్టీవారు, మగ లా పార్టీవారు చెట్టు నీడను చేరుకొందురు.]

డైర:—ఇప్పుడేమిటి కర్తవ్యం?

అ. డై:—కుక్కను రానివ్వండి.

మగ:—ఇక అది వచ్చేదేమిటి? అర్ధరాత్రివేళ యింటి నుండి యిల్లాలు పారిపోయినట్లు పారిపోయింది, గాబట్టి దానికి డైవర్సు యివ్వవలసినదే. (అని లలిత స్నేహితురాలివైపు చూచును.)

చంటి:—నేను నా భర్తకు డైవర్సిచ్చి సినిమా కంపెని చేరానని మగలవ్వారుగారు నన్ను దెప్పుతున్నారు.

లలిత:—డైవర్సు, మ్యారియేజిని రివర్సు చేయడానికి కనుక అందులో తప్పేమీ లేదు. కాని ఎల్లప్పుడు మిస్. గా వుంటే యిటువంటి అపవాదులు 'మిస్' అయేవి.

సూరి:—మగలవ్వారుగారు చాలా అన్యాయం చేస్తున్నారు. అతని సెట్లు ఆడలవ్వారుపై వుండవలెను గాని 'చంటి'పై వుండరాదు. డైరెక్టరుగారు యిది గమనించాలని నా మనవి.

అ. డై:—సెట్లకేమొచ్చింది తొందర? కుక్కను తీసుకుని రానివ్వండి.

డైర:—ఇంక కుక్క వచ్చే దారి కనుపించదు. ఇదింకా ట్రయల్ సీనే కనుక నేను కుక్కక్రింద వుండెదను. కండువా వొకటి నా మెడకు గట్టి అదే గొలుసను కొని కథను కానివ్వండి.

[డైరెక్టరు కుక్కవలె వొంగగా, 'సూరి' తన తలపాగా విప్పి అతని మెడకు గట్టును.]

మగ:—సఖుడా! సూరీ! ఈ అందమైన కుక్కను చూచితివా?

డైర:—(కుక్కవలె మొఱిగి అక్షిన్ను జేయును).

సూరి:—నిక్కరు తొడిగిన డైరెక్టరు కుక్కనా!

డైర:—డైరెక్టరు కుక్కో, తోడేలో మీకేమి తెలుసు? ముందు మీ కథ కానివ్వండి.

అ. డై:—"మగలవ్వారు గొలుసు చివరను పట్టుకొనవలెను. ఆడలవ్వారు గొలుసు మధ్య భాగమును పట్టుకొనవలెను. ఇరువురు 'కుక్క మాది'. "కుక్క మా"దని చెరియొక వైపునకు లాగవలెను."

ఆడలవ్వారు, మగలవ్వారట్లు జేయుదురు.

లలిత:—ఈ కుక్క మాది.

మగ:—ఈ కుక్క మాది.

* పెద్దవారి పేరు అల్లుళ్లకు పెట్టితే పెద్దవారి కిట్టి అవసరాక యింకే మౌతుంది?

లలిత:—ఇది మా సీమ కుక్క.

మగ:—ఇది మా సినిమా కుక్క.

లలిత:—ఇది మా పెద్ద కుక్క.

మగ:—ఇదే మా పెద్ద కుక్క.

లలిత:—మా కుక్క గొలుసుతో పోయింది.

మగ:—మా కుక్క గొలుసు తీసుకుని పోయింది.

లలిత:—సఖీ! చంటీ! రావే! మన కుక్కను లాగవే!

మగ:—సఖా! సూరీ! రారా! మన కుక్కను లాగరా!

[రెండువైపుల ఆడలవ్వారొక వైపునా, మగలవ్వారొక వైపునా లాగుదురు.]

అ. డై:—లాగడంలో జోరుండాలె. ఎంత లాగితే అంత 'లా' సాగిందన్న మాట.

అ. డై:— "మా 'లా' అంటే"!

సూరి:—సైడ్ ఆక్టర్ల 'లా',

అ. డై:—సైడ్ ఆక్టర్ల 'లా' మాపులు రంపాడటం వల్ల.

సూరి:—అయితే నాలుగైదు సెట్లు పారెయ్య వచ్చునన్న మాట.

[అటుల జేయును.]

అ. డై:—"ఇక లాగుట మాని, ఆడలవ్వార్ రెండు దొంగ చూపులు మగలవ్వారుపై ప్రసరింపవలెను. మగలవ్వార్ వాని నందుకొని, చూపులు తూపులగునట్లు ఆమె వక్షస్థలములు జూడవలెను." (మగలవ్వారుతో) మీ బాణప్రయోగ మిప్పుడు ప్రయోగములోనికి దీసుకొని రావచ్చును.

డై:—ఏ బాణ ప్రయోగము!

అ. డై:—వెదురు బాణము,

డై:—వెదురు బాణమా! నాకేమి అర్థమవలేదు!

అ. డై:—అర్థమవుతుంది. చూస్తూ వుండండి.

[మగలవ్వారు వెదురు బాణమును తనకంటి ప్రక్కనుండి ఆమెపై విసరును. దానిని ఆడలవ్వారు అందుకొని తన వక్షస్థలమునకు గ్రుచ్చుకొనును.]

డైరె:—అంటే చూపు ఆ విధముగా వెళ్లి తూపై ఆమె హృదయమును గ్రుచ్చుకున్న దన్నమాటా? చాలా దివ్యంగా ఆ సామెతను అనుభవములోనికి దీసుకుని వచ్చారు.

మగ:—సినిమా అంటే యిటు వంటివి నాలుగు విద్యలు చూపెడితేనే సినిమా అవుతుంది.

సూరి:—గారడీ విద్యలవలె వానిని ప్రయోగించుటలో వున్నది నేర్పు.

డై:—చాలా బాగా అభినయించారు. మీకు నూటికి పదివంతున ఎక్కువ యిస్తాను.

అ. డై:—"ఆడలవ్వారు మూర్ఛవచ్చినట్లు అభినయించవలెను."

లలిత:—చంటీ! చంటీ! నీ సెట్లు మాని యిటు రావే. నాకు మూర్ఛ వచ్చుచున్నదే.

చంటి:—ఎందుకమ్మా?

లలిత:—అతని చూపు తూపై నా హృదయమును గ్రుచ్చుకున్నదే.

చంటి:—అయితే దానిని తీసి వెయ్యమంటారా?

లలిత:—వద్దు.

అ. డై:—"ఆడలవ్వారు పైటను యింకా జార్చి వుంచవలెను. లేకపోతే ఫొటోలో రక్తి గట్టదు."

లలిత:—చూడు చంటీ! నేను జీవింప గలనా? (మూర్ఛ నొందును.)

చంటి:—గచ్చాకు పుచ్చాకు వైద్యము చేయక కొంత షరబత్తు నీళ్లు పట్టాను.

[అటుల జేయును.]

లలిత:—అమ్మయ్య. బ్రతికితిని. చంటీ! ఆయన ఏరీ?

చంటి:—ఎవరు?

అ. డై:—"మగలవ్వారు మంబన మభినయించి కుక్క గొలుసును ఆడలవ్వారున కివ్వవలెను. ఆడలవ్వారు కుక్కతో వెనుకకు బోవలెను."

లలిత:—అయ్యా! అసిస్టెంటు డైరెక్టరుగారు! ప్రేమంగు చూపు యిక్కడే యివ్వవలెనా? ఇంకా కొంచెము దూరము పైకి పోయి యియ్యవలెనా!

అ. డై:—ఇక్కడ కాదు. ఇంకా కొంచెము దూరము పైకి పోవలెను. "కుక్కను ఆడలవ్వారు పార్టి లాగుకొని వెనుకకు పోవలెను."

లలిత, చంటి:—

[డైరెక్టరును అతని మెడకు కట్టిన కండు వాతో దూరము లాగుకొని పోదురు. కొంచెము దూరమున డైరెక్టరునకు మోకాళ్ళకు అరచేతులకు పల్లేరుకాయలు గ్రుచ్చుకొనును.]

డైర:—(లేచి నిలచి దులుపుకొనుచు) ఇక్కడెవరు పల్లేరు ముండ్లు పోసినది?

అ. డై:—నేను పోయించాను!

డైర:—ఎందులకు?

అ. డై:—అక్కడ ఆడలవ్వారు 'కాలికి ముండ్లు గ్రుచ్చుకొనె' నను నెపమున వంగి వానిని తీయుచు మగలవ్వారునకు పార్టింగు సైటు యియ్యవలెను.

లలిత:—అది శాకుంతల నాటకమున శాకుంతల అభినయించే ఆక్షన్ ఇక్కడెలా పనికి వస్తుంది?

అ. డై:—పనికి వచ్చేదేమిటి? సినిమాకు పనికి వచ్చేదప్పుడు చెయ్యానే చెయ్యకూడదు. పనికిరాని వాటినే తీసుకుని సినిమాకు సారస్యం తీసుకుని వస్తూ వుండవలెను.

లలిత:—ఆ చూపును యింకొక విధముగా చూపుతాను.

డైర:—ఎట్లాగు?

లలిత:—ఆ మధ్య బీచికొక కలెక్టరుగారి కూతురు వచ్చి నాలుగుమూలలు తిరగి, పోబోయే ముందు కారు వద్దకు వచ్చి చేతిరుమాలును క్రింద పారేసి కాలితో దాని నందుకొనబోయి, వొళ్లు విరుచుకుని కుడివైపునకు షోకుగా వంగి పార్టింగు చూపు అదో అందముగా పారేసేది. అది అభినయించాలని వుంది.

డైర:—తప్పకుండా చెయ్యవలసినదే. అలా 'నావల్టీ' (Novelty) తీసుకుని వస్తేనే సినిమా పరువు నిలబడుతుంది. అయితే మీవద్దనుండి వాళ్లు నేర్చుకొనవలసినది బోయి వాళ్లవద్దనుండి మీరు నేర్చుకుంటున్నారేమిటి?

చంటి:—మా సినిమా 'కట్లు' వాళ్లకు మేము నేర్పుతాము. వాళ్లనుండి మేమవి సంగ్రహిస్తాము.

[లలిత ఆ యాక్షన్ చేసి, భుజము పట్టుకుని కూర్చుండును.]

అ. డై:—ఏమి అలా కూర్చున్నది? భుజము పట్టు పట్టలేదుగదా!

చంటి:—ఒళ్లు ఎక్కువగా విరుచుకోవడమువల్ల బాడీ రిబ్బను తెగింది.

లలిత:—రా చంటి! అవతలకు బోయి దానిని బాగు చేసుకుందాము.

[ఆడలవ్వారు, ఆవిడ స్నేహితురాలు ప్రక్కకు నిష్క్రమింతురు.]

అ. డై:—"ఆ తరువాత మగలవ్వారు చెట్టెక్కి బాసి పోతివే సఖీ అనే పదమును గొంతుక చించుకుని పాడవలెను."

మగ:—అయ్యా డైరక్టరుగారు! నాకు చెట్టెక్కడం తెలియదు. చేమెక్కడం తెలియదు. సీమ చింతచెట్టు అసలే ఎక్కలేను. మీకు కావలసి వుంటే యిక్కడకు ఏభైగజముల దూరములో రైల్వే కంపెనీ వారి అవుటర్ సిగ్నల్ (Outer Signal) వుంది. అది చెట్టుకన్న ఎత్తయినది. అదెక్కి పాడమంటే పాడుతాను.

డైర:—(అసిస్టెంటు డైరక్టరుతో) ఏమంటారు యీ వుద్దేశం?

అ. డై:—ఓ దివ్యంగా వుంది. కాశీ మజిలీలలో రాజుకూతురు తలార్చుకోవడము కోసరమని ఏడు మిద్దె లెక్కి నిల్చునేది. అంతకన్నా యిది ఎత్తు వుండదు.

డైర:—ఏదో యిటువంటి విద్యలు నాలుగైదు చూచుకుంటేనే గాని సినిమా రక్తి కట్టదు. చూడండి మనలవ్వారు అంత ఎత్తునుంచి పాడి అభినయించాడంటే ఎంత రొమాన్సు వుంటుందో.

అ. డై:—ఎన్ని చూపులు చూస్తే అంత 'లా' రొమాన్సు పుట్టుతుంది. ఎన్ని పాటలు పాడితే అంత 'లా' రొమాన్సు పెరుగుతుంది. మనవాడు అంత ఎత్తునుంచి పాడితే 'లా' రొమాన్సు విపరీతంగా పెరుగుతుందనడములో ఆశ్చర్యమేముందీ? సావిత్రీ టాకీలో సత్యవంతుడు చెట్టెక్కి పాడెను గాబట్టే అక్కడ 'లా' అంత శోభించింది. మన 'రియల్ లా రీలు' అంతకన్నా మించిపోతుంది.

డైరె:—అవును. రైలు సిగ్నలు, రైలునకు రొమాన్సు లేదు గాని మన 'లా' రీలుకు తప్పక రొమాన్సు తెస్తుంది.

[తెర.]




అక్షరాలు ముత్యాల కోవలు!

"రత్నా యింప్రూవ్డ్"

కలాల్లో వ్రాస్తే ముత్యాలవంటి అక్షరాలు కుదుర్తాయి. ఇవి చాలాకాలం పనిచేస్తాయి.

నిప్పుకి మండవు; విరిగిపోవు; తళతళ లాడ్తుంటాయి. మంచి అందమైన బంగారు పాళీలు. వాని చివర 25-వ సంవత్సరములవఱకు పనిచేసే యిరిడియమ్ పొదగబడింది.

రకరకాల రంగులతో, రోల్డుగోల్డు క్లిప్పులతో ముద్దులు మూటగట్టు నీకలాల వెల సరసం.

కావలెనంటే మీమీ పేర్లు కలాలపైన ఉచితంగానే చెక్కుతాం.
కావాలి మీ అందఱి ప్రోత్సాహం.

కె. రత్నా అండ్ కో.,
విద్యార్థులకు ప్రియమైన షాపు.

305, ఎస్ప్లనేడ్ రోడ్,
మద్రాసు.

మీకు కావలసిన చక్కని స్వదేశీ సిల్కు యుడుపులు, గుడ్డలు, పలువిధములైన చీరెలు, జాకెట్టు రకములును,

కేశవరామ్ అండు కంపెని,

1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసులో దొరకును.